# విభారె తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 22-08-2024 సంపుటి : 06 సంచిక : 334 పేజీలు : 8 వెల : రూ 3-00







## బంద్ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రతిష్టమైన భద్రత ఏర్పాట్లు.

తిరుపతి భారత్ బంద్ నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమై పటిష్ఠమైన బద్రతా ఏర్పాట్లను చేపట్టింది. సబడివిజినల్ అధికారుల పర్యవేక్షనలో బందోబస్తు కొనసాగుతుంది. ఏక్కడ కూడా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు లేకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.బుధవారం ఉదయం నుండే పోలీసులు బస్టాండ్, రైల్వే స్టేషన్, ప్రధాన సెంటర్ లలో పికెట్స్ లను ఏర్పాటు చేసుకొని ప్రజా దినచర్యలో ఆటంకం కలగకుండా పహారా కాస్తున్నారు. సర్వీస్ వాహనాలకు ఎలాంటి ఆటంకాలు కలవకుండా ఏర్పాట్లు చేశారు.

# అనకాపల్లి ఫార్మా కంపెనీలో పేలిన రియాక్టర్ ..

## రియాక్టర్ పేలిన ఘటనలో పెరుగుతున్న మృతుల సంఖ్య ..7గురు మృతి.. సీఎం చంద్రబాబుగ్భ్రాంతి




అమరావతి : ఏపీలోని అనకాపలి జిల్లా అచ్యుతాపురం సెజ్ ఎస్సెన్సీయా ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలిన ఘటనలో మృతుల సంఖ్య గంటగంటకు పెరుగుతుంది. తాజాగా మృతుల సంఖ్య ఏడుకు చేరుకుంది. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. 25 మంది గల ఎన్డీఆర్ఎఫ్ బృందం ఘటన స్థలానికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించారు.ఈ ఘటనలో మొత్తం 50 మంది గాయపడగా పలువురి పరిస్తితి విషమంగా ఉంది. రియాక్టర్ పేలిన తరువాత ఓ భవనం కుప్పకూలడంతో ఆ శిథిలాల కింద మరికొందరు కార్మికులు ఉండవచ్చని భావిస్తున్నారు. ఫార్మా కంపెనీ మూడో అంతస్తులో పలువురు కార్మికులు చిక్కుకోగా అగ్నిమాపక సిబ్బంది వారిని క్రేన్ సహాయంతో సురక్షితంగా కిందకు దించారు .మొత్తం 12 అగ్నిమాపక దళాలు మంటలను ఆర్పివేసేం దుకు ప్రయత్నిస్తున్నారు. పేలుడు దాటికి భారీ శబ్ధం రావడం, సమీప ప్రాంతాల్లో దట్టమైన పొగ వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పేలుడు సమయంలో మొత్తం 300 మంది ఉన్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న ఏపీ సీఎం చంద్రబాబు (అష్ట్రజీనిటతీజీ ఃజీఎబీ) తీవ్రగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఘటనపై కలెక్టర్‌తో మాట్లాడారు. తక్షణ సహాయ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

### ఇద్దరు కార్మికులు దుర్మరణం



అమరావతి : ఏపీలోని అనకాపల్లి జిల్లాలోని ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలి ఇద్దరు మృతి చెందగా మరో 18 మందికి గాయాలయ్యాయి. బుధవారం మధ్యాహ్న భోజన సమయంలో జరిగిన ఘటనతో పెను ప్రమాదం తప్పింది. అచ్యుతాపురం సెజ్ లోని ఎసెన్సియా కంపెనీలో అకస్మత్తుగా రియాక్టర్ పేలింది. పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో అక్కడ పనిచేస్తున్న 18 మంది కార్మికులకు గాయాలయ్యాయి.మరికొంత మంది మధాహ్నభోజన సమయంలో భోజనం చేసేందుకు బయటకు వెళ్లిన సమయంలో ప్రమాదం జరగడంతో క్షతగాత్రుల సంఖ్య తగ్గింది. విషయం తెలుసుకున్న యాజమాన్యం హుటాహుటిన బాధితులను అనకాపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. హారిక అనే కార్మికురాలిని ఆసుపత్రికి తరలిస్తుండగా ఆమె మృతి చెందింది. మరో కార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆరు అగ్నిమాపక శకటాలు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఘటనపై హోంమంత్రి అనిత జిల్లా కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు.

## కడప విద్యుదాఘాతం ఘటనలో మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి అండగా ఉంటాం : మంత్రి నారా లోకేష్



అమరావతి : కడపలో బుధవారం విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి చెందిన ఘటనపై ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన ఘటనా విషయం తెలియగానే ఆందోళన వ్యక్తం చేశారు.కడప పట్టణంలోని అగాడివీధి పాఠశాలలో చదువుకుంటున్న ఇద్దరు విద్యార్థులు (ాబిబీటవనిబిబ) మధ్యాహ్న భోజన సమయంలో ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో తెగి ఉన్న విద్యుత్ తీగలు తగిలి తన్వీర్ అనే విద్యార్థి మృతి చెందడం బాధాకరమని అన్నారు. గాయపడిన ఆదాం అనే మరో విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని జిల్లా అధికారులను ఆదేశించారు.మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కడప పట్టణంలోని అగాడివీధిలో జరిగిన ఘటనపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని విద్యార్థి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## విశాఖ ఎమ్మెల్సీగా బొత్స సత్యనారాయణ ప్రమాణం



అమరావతి : వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ బుధవారం స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ప్రమాణం చేశారు. మండలి చైర్మన్ కొయ్యే మోషెన్‌రాజు తన చాంబర్‌లో బొత్సచేత ప్రమాణం చేయించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. శాసనసభ, శాసన మండలిలో ప్రజల కోసం నిలబడతామని , ప్రజా సమస్యలను మండలి దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ప్రజలకిచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని కోరారు.పార్టీ అధిష్టానం మేరకు బాధ్యతయుతంగా ప్రజల తరుఫున మండలి లో చిత్తశుద్ధితో పోరాటం చేస్తానని వెల్లడించారు. రాబోయే కాలంలో విశాఖను,ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతానని వెల్లడించారు. ప్రస్తుతానికి వైసీపీ పార్టీది మూడు రాజధానుల విధానమేనని అన్నారు. అంతకు ముందు బొత్స వైఎస్ జగన్‌ను కలిసి ఎంతో నమ్మకంతో ఎమ్మెల్సీ పదవి అవకాశం ఇచ్చినందుకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట మాజీ మంత్రి అమర్నాథ్, వైసీపీ నాయకులున్నారు.గత మూడు నెలల క్రితం ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు నిర్వహించగా బొత్స సత్యనారాయణతో పాటు మరొక స్వతంత్ర అభ్యర్థి రహీమ్ నామినేషన్ వేశారు. స్వతంత్ర అభ్యర్థి తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## గంజాయి,మత్తుపదార్థాల నియంత్రణకు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా






విభారే న్యూస్ కర్నూలు ప్రతినిధి, ఆగస్టు, 21 : గంజాయి, మత్తుపదార్థాల నియంత్రణకు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో మత్తుపదార్థాల నియంత్రణకు సంబంధించిన జిల్లా సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి, మత్తుపదార్థాలను వినియోగించకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు.. విద్యార్థులు, యువత మత్తు పదార్థాల బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం పూర్తి స్థాయిలో పర్యవేక్షణ, తనిఖీలను పెంచాలన్నారు.. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుల్లో గట్టి నిఘా ఉంచాలన్నారు...అంతర పంట గా గంజాయి సాగుచేసే అవకాశం ఉందని, అటవీ, వ్యవసాయ శాఖ అధికారులు గమనిస్తూ ఉండాలన్నారు..తెలిస్తే సమాచారాన్ని పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. అదే విధంగా జిల్లా సరిహద్దుల్లో తిరిగే బస్సులు, బస్టాండ్స్ పై కూడా నిఘా ఉంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. కళాశాలలు, విద్యా సంస్థల్లో విద్యార్థులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఆగస్టు 23వ తేదిన రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించుకోవడం జరుగుతుందని,ఈ సమావేశాల్లో మత్తుపదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ఒక ప్రతిజ్ఞ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు... ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న డిఅడ్డిక్షన్ సెంటరుకు ఎంత మంది వచ్చి చికిత్స తీసుకుంటున్నారనే వివరాలను కలెక్టర్ డిఎంహెచ్‌ఓను అడిగి తెలుసుకున్నారు.జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు మత్తు పదార్థాలపై యువతలో అవగాహన కల్పించేందుకు హోర్డింగ్స్ ఏర్పాటు చేయడంతో పాటు 30 ప్రభుత్వ కళాశాలు, 44 ప్రైవేటు కళాశాలలోని విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అదే విధంగా జూనియర్, సీనియర్ ఇంటర్మీడియట్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు కూడా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు ఎన్డిపిఎస్ యాక్ట్ (ఔఆఖూ ంఞబి) గురించి విద్యార్థులకు పూర్తిగా అవగాహన కల్పించడం జరిగిందని ఎస్పీ వివరించారు..సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, సెబ్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్, అటవీ శాఖ అధికారి శ్యామల, ఇంఛార్జి మున్సిపల్ కమిషనర్ రామలింగేశ్వర్, డిటిసి శ్రీధర్, ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఔషధ నియంత్రణ ఎడి రమాదేవి, ఇంఛార్జి డిఎంహెచ్‌ఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రాఘవేంద్ర స్వామి సప్తరాత్రోత్సవాలు మహోత్సవాలు





మంత్రాలయంవిభారే న్యూస్ మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి సన్నిధిలో సప్తరాత్రోత్సవాలు నాలుగువరోజు అంగరంగ వైభవంగా జరిగాయి.శ్రీ రాఘవేంద్ర స్వాములవారి బృందావనానికి హెచ్.హెచ్.శ్రీ సుభుదేంద్ర తీర్థ స్వాములవారు వెన్నెతో అభిషేకం,నెయ్యి తో అభిషేకము, అనేక రకరకాల పండ్లు తో అభిషేకం,పాలాభిషేకము,పంచామృత అభిషేకము, కనకాభిషేకము, ముత్యాలతో అభిషేకాలు, పుష్పాభిషేకము, చేసి బృందావనానికి ప్రత్యేక పూలమాలలతో అనేక రకాల పుష్పాలతో అలంకరణ చేసి స్వాములవారు బృందావనానికి ప్రత్యేక పూజలు చేసి మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం హెచ్ హెచ్ శ్రీ సుభుదేంద్ర తీర్థ స్వాములవారు శ్రీ రాఘవేంద్ర స్వాములవారు నీ బంగారు రథోత్సవం పై అలంకరణ చేసి వేలాది మంది భక్తుల మద్య ఆలయ లో మెలతాలాలతో భజనలు చేస్తు ఆలయ ప్రాంగణంలో హెచ్.హెచ్.శ్రీ సుభుదేంద్ర తీర్థ స్వాములవారు పూజలు చేసి మంగళహారతులు చేసి ఊరేగింపు చేశారు. ఈశుభ సందర్భంగా హెచ్.హెచ్.శ్రీ సుభుదేంద్ర తీర్థులు ప్రవచనం చేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు . అనంతరం హెచ్.హెచ్.శ్రీ సుభుదేంద్ర స్వాములవారు భక్తులకు పల మంత్రాక్చతలు ఇచ్చి ఆశీర్వదించారు.



# సంపాదకీయం

గురువారం 22-08-2024

## చట్టాలు మారితేనే... న్యాయం

గతంలో నిర్భయ హత్యాచారం కేసు, మొన్నటికి మొన్న నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడి కేసు నుండి ఇపుడు హాస్పిటల్లో ఏకంగా ఒక ట్రెయినీ డాక్టర్‌పై ఘోర హత్యాచారం.. వరుసగా ఈ దారుణ ఘటనలు వింటుంటే ఒళ్ళు జలదరిస్తోంది. 2012 నుంచి అత్యాచారం కేసులు పెరుగుతున్నాయే గానీ, వాటి సంఖ్య తగ్గడంలేదు. ఈ అత్యాచారాలకు ముగింపు ఎప్పుడో .. ఎవరూ చెప్పలేకపోతున్నారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు మాత్రం ర్యాలీలు తీయడం, కొవ్వొత్తులు వెలిగించడం. అవి అరిపోయాక ఆ సంఘటన మరిచిపోవడం అలవాటు అయిపొయింది అందరికీ. కానీ రేపటి రోజు ఆ చిన్నారి స్థానంలో గానీ, నిర్భయ స్థానంలో గానీ మన పిల్లల్ని చూసే పరిస్థితి రాకూడదంటే సమాజంలో ఎటువంటి మార్పులు తీసుకు రావాలి అని ఆలోచించే సమయం ఇది.!అసలు లైంగికదాడి, హత్యాచారం వంటి దారుణ ఘటనలు జరగడానికి కారణాలు ఏంటో తెలుసుకుని వాటికి పరిష్కారం తెలుసుకుంటే సమాజంలో మార్పులు చూడవచ్చు. ఈ మధ్య కాలంలో టీవీల్లో, సినిమాల్లో ప్రకటనల్లో ఎక్కడ చూసినా, విన్నా ఒక మాటే చెపుతున్నారు. అమ్మాయిలకి ఎలాంటి బట్టలు వేసుకోవాలో చెప్పేకన్న మీ అబ్బాయిలకు చదువుతో పాటు సంస్కారం నేర్పండి అంటున్నారు. దాంతోపాటు మహిళలపై, చిన్న పిల్లలపై లైంగిక దాడులను అరికట్టాలంటే కఠినమైన చట్టాలు, విద్య విధానంలో మార్పు తేవాలి. కుటుంబ విలువలు నేర్పాలి. మన దేశంలో పేదరికం, అక్షరాస్యత పూర్తిగా నిర్మూలించడం అసాధ్యం. చదువుకున్న వాడికైతే సంస్కారం నేర్పగలము కానీ చదువుకున్నప్పటికీ మనసులో తప్పుడు ఆలోచనలు పెట్టుకున్న వాడికి, నాగరికత, సమాజం పట్ల బాధ్యత, భయం లేని వారికి ఎవరు నేర్పుతారు?సమాజాన్ని బాగుపరచటంలో మీ వంతు సహాయం లేకపోయినా పర్వాలేదు కానీ సమాజంలో జరుగుతున్న సంఘటనలకు మీరు కారణం కాకూడదు. మన సమాజంలో చిన్నతనం నుంచి రకరకాల కారణంగా కుటుంబ విలువలు, మాట్లాడే పద్ధతి తెలియకుండా, మంచీ చెడూ తెలియకుండా పెరిగిన ఎంతో మంది ఈ సమాజంలో మన మధ్యలో తిరుగుతున్నారు. చదువుకున్నా కూడా చిన్నప్పటి నుంచి వాళ్లకు జరిగిన చేదు అనుభవాల వల్ల కొందరిలో మానసికోన్మాదపు వ్యక్తిత్వం వస్తుంది. అలాంటి వాళ్లకు చదువుతో పని లేదు. అమ్మాయిలు ఎదుటి వారిలో కోరికలను ప్రేరేపించే దుస్తులు వేసుకుంటేనే అత్యాచారాలు జరుగుతాయని గ్యారంటీ ఎక్కడుంది? కోల్‌కతా మెడికల్ కాలేజీలో ఆ ట్రెయినీ డాక్టర్ ఎలాంటి రెచ్చగొట్టే దుస్తులు వేసుకుందని ముష్కరులు అంత దారుణ కృత్యానికి ఒడిగట్టారు మూడేళ్ల పసిపాపలు, 70 ఏళ్ల ముదుసలులు ఎవరిని రెచ్చగొడుతున్నారని వారిమీద పడుతున్నట్లో మరి.ప్రస్తుతం వున్న విద్యా వ్యవస్థలో మార్పు రావాలి. మనోవిజ్ఞానం అనే అంశాన్ని ఒక సబ్జెక్టుగా గుర్తించాలి. చిన్నప్పటి నుండే ప్రతీ స్టూడెంట్ మానసిక పరిస్థితిని గుర్తించడం, వారిలో మార్పు తీసుకురావడానికి ప్రయత్నాలు చేయాలి. ఒక హత్య కానీ, లైంగిక దాడి కానీ చేసిన వ్యక్తిని మెంటల్ హాస్పిటల్‌లో వుంచి కేస్ స్టడీ చేసి, తన మానసిక పరిస్థితికి కారణాలు కనుక్కొని ఆపై అతగాడికి జాప్యం లేకుండా కఠిన శిక్ష విధించాలి. అయితే కఠిన చట్టాలు విధించినంత మాత్రాన తప్పు చేయరనీ, లైంగిక దాడులు ఆగిపోతాయని అనుకోలేం. ఈ ఘటనపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారు తీరును సుప్రీం ధర్మాసనం తీవ్రంగా ఖండించింది. మెడికల్ ప్రిన్సిల్ తీరుపై కోర్టు అసహనం వ్యక్తం చేసింది. నేరాన్ని ఉదయాన్నే గుర్తించినట్లు తెలిసినా.. ప్రిన్సిపల్ ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని కోర్టు వ్యాఖ్యానించింది.ప్రిన్సిపల్ ప్రవర్తనపై అనుమాలు ఉన్నా.. అతడిని వెంటనే మరో కాలేజీకి ఎలా నియమించారని సీజేఐ జస్టిస్ డి.వై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ప్రశ్నించింది. ఇక ఎఫ్ఐఆర్ నమోదు కూడా ఆలస్యమైంది. మృతదేహాన్ని అంత్యక్రియలకు అప్పగించిన మూడు గంటల తర్వాత రాత్రి 11.45 గంటలకు ఎందుకు నమోదు చేయాల్సి వచ్చింది? ఆసుపత్రి అధికారులు, కోల్‌కతా పోలీసులు అప్పటిదాకా ఏం చేస్తున్నారు అంటూ ధర్మాసనం ప్రశ్నల వర్షం కురిపించింది.ఇక పలు మీడియా సంస్థల తీరుపై కూడా కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బాధితురాలి ఫొటో, పేరును ఎలా ప్రచురిస్తారంటూ ప్రశ్నించింది. అలాగే వ్యవస్థలో ఉన్న కొన్ని లోపలపై కూడా ధర్మాసం పలు కీలక ప్రశ్నలను సంధించింది. మహిళలు ఉద్యోగాలకు వెళ్లే పరిస్థితి లేకపోతే.. పనిచేసే ప్రదేశంలో భద్రత లేకపోతే వారికి మనం సమానత్వాన్ని నిరాకరిస్తున్నట్లేనని కోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుత రోజుల్లో చాలా మంది యంగ్ డాక్టర్లు 36 గంటలు ఏకధాటిగా పనిచేస్తున్నారు. వారికి పని ప్రదేశంలో భద్రత కల్పించడం కోసం ఓ జాతీయ ప్రొటోకాల్‌ను రూపొందించడం అత్యవసరమని కోర్టు వెల్లడించింది. ఇందుకోసం వెంటే ఓ జాతీయ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇందులో హైదరాబాద్‌కు చెందిన ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నేషనల్ గ్యాస్ట్రాలజీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి, సర్జన్ వైస్ అడ్మిరల్ ఆరే సరిన్ తదితరులు సభ్యులుగా ఉంటారని ధర్మాసనం తెలిపింది. రెండు వారాల్లోపు మధ్యంతర నివేదిక సమర్పించాలని నేషనల్ టాస్క్‌ఫోర్స్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. మరోవైపు డాక్టర్ల విధుల బహిష్కరణతో చాలా మంది రోగులు ఇబ్బందిపడుతున్నారని, తక్షణమే తమ నిరసనలు విరమించాలని డాక్టర్లకు సుప్రీంకోర్టు విజ్ఞప్తి చేసింది. అనంతరం ఈ విచారణను సుప్రీంకోర్టు గురువారానికి వాయిదా వేసింది.దుబాయ్, అమెరికా లాంటి దేశాల్లో తప్పు చేయటానికి భయపడతారు కాబట్టి అక్కడ నేరాలు ఏవీ జరగవని చెప్పగలమా?మన దేశంలో మార్పు రావాలి అంటే చట్టాలు మారాలి, విద్యా వ్యవస్థ మారాలి. అందరికీ ఉచిత విద్య, అందరికీ క్రీడల్లో ఉచితంగా శిక్షణ ఇప్పిస్తే ఆరోగ్యమైన మనోవికాసంతో మన దేశం గర్వపడేలా ఒలింపిక్స్ లో గెలవగలుగుతారు.

## తన కలాన్ని ఖడ్గం గా చేసి నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు షోయబుల్లాఖాన్.

### -నేడు ఆయన వర్ధంతి

షోయబుల్లాఖాన్ తెలంగాణా సాయుధ పోరాట యోధుడు. బాహ్య ప్రపంచానికి అంతగా తెలియని త్యాగధనుడు, నిర్భయ జర్నలిస్ట్, మత దురహంకారానికి వ్యతిరేకి. షోయబ్ ఉల్లాఖాన్ 1920, అక్టోబరు 17 న ఖమ్మం జిల్లా సుబ్రవేడులో జన్మించారు. తండ్రి హబీబుల్లాఖాన్. నిజాం ప్రభుత్వంలో రైల్వేలో పనిచేశారు. తల్లి లాయహున్నీసా బేగం. షోయబుల్లాఖాన్ వీరికి ఏకైక సంతానం. వీరి కుటుంబం ఉత్తరప్రదేశ్ నుంచి నిజాం ప్రాంతానికి వలస వచ్చి ఇక్కడ స్థిరపడింది. షోయబ్ భార్య ఆజ్మలున్నిసా బేగం. వీరికి ఇద్దరు కుమార్తెలు. షోయబ్ ఉస్మానియా




విశ్వవిద్యాలయం నుంచి బిఎ, జర్నలిజం డిగ్రీ చేశాడు. బొంబాయిలో ఇంటర్మీడియట్ గ్రేడ్ డ్రాయింగ్ పరీక్ష కూడా పాసయ్యాడు. తన కుమారునిలో మహాత్ముని పోలికలున్నాయని షోయబుల్లా తండ్రి మురిసిపోయేవాడు. ఈ కారణం చేతనే షోయబ్ ను ఆయన 'షోయబుల్లా గాంధీ' అని ముద్దుగా పిలుచుకునే వాడు. గాంధీలాగానే షోయబ్ కూడా తాను నమ్మిన మార్గంలో ప్రయాణించడంలో నిబద్ధతను, మొండితనాన్ని ప్రదర్శించాడు. ప్రోగ్రెసివ్ మూవ్మెంట్ లో పాల్గొన్నాడు, విశాలభావాలు కలవాడు.షోయెబుల్లా ఖాన్ విద్యాభ్యాసం పూర్తిచేసుకున్నాకా జీవితాన్నంతా పత్రికావృత్తిలో గడిపారు. షోయబుల్లా రచనా జీవితం తేజ్ పత్రికలో ప్రారంభమైంది. నిజాం నిరంకుశత్వాన్ని వ్యతిరేకిస్తూ, ఖాసిం రజ్వీ దురాగతాల్ని ఖండిస్తూ విశ్లేషణాత్మక కథనాలు రచించారు. అటువంటి రచనల్ని ప్రచురిస్తున్న కారణంగా నిజాం ప్రభుత్వం తేజ్ పత్రికను నిషేధించింది. ఆ సమయంలోనే ప్రసిద్ధ కాంగ్రెస్‌నాయకుడు ముందుముల నరసింగరావు సంపాదకత్వంలో వెలువడుతున్న రయ్యత్ పత్రికలో ఉప సంపాదకునిగా బాధ్యతలు చేపట్టారు. రయ్యత్ పత్రిక కూడా నిజాం నిరంకుశత్వాన్ని విధానపరంగా విభేదించింది. అప్పటికే ముమ్మరంగా తెలంగాణా సాయుధ పోరాటం జరుగుతోంది. ఆ సందర్భంలో రయ్యత్ పత్రికలో నిజాం ప్రభుత్వం అమలుచేస్తున్న దమనకాండ, ప్రజాఉద్యమాన్ని అణచివేసేందుకు రజ్వీని ఉసిగొలుపుతున్న పద్ధతులను వ్యతిరేకిస్తూ రచనలు చేశారు. ఆ పత్రికను కూడా నిజాం ప్రభుత్వం నిషేధించింది.రయ్యత్ నిషేధానికి గురయ్యాకా షోయబుల్లా ఖాన్ స్వంత నిర్వహణలో ఇమ్రోజ్ అనే దినపత్రికను స్థాపించారు. ఆ పత్రికకు సంపాదకత్వ బాధ్యతలు షోయబుల్లా స్వీకరించారు. రాజకీయ స్థితిగతులు అప్పటికే వేడెక్కాయి. పాకిస్తాన్‌కు కోట్లాది రూపాయలు ధనసహాయం చేయడం వంటి చర్యలు నిజాం, రాజ్యంలోని ప్రజలతో దాదాపుగా యుద్ధం చేస్తూ ఖాసింరజ్వీ పరిస్థితుల్ని మార్చేశారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ రాజ్యానికి చెందిన ఏడుగురు ముస్లిం పెద్దలు ఒక పత్రాన్ని తయారుచేశారు. నిజాం రాజుకీ, ఆయన ప్రజలకీ హైదరాబాద్ రాజ్యాన్ని భారత యూనియన్‌లో రాజ్యాన్ని విలీనం చేయడమే సరైన నిర్ణయమని ఆ పత్రం సారాంశం. ఈ పత్రాన్ని ఇమ్రోజ్ పత్రికలో యధాతథంగా షోయబుల్లా ఖాన్ ప్రచురించారు. ఈ ప్రకటనాంశాన్ని భారత ప్రభుత్వం ఐక్యరాజ్యసమితిలో ఉపయోగించుకుంటుందేమోనని నిజాం భయపడ్డాడు. ఈ పరిణామాలే చివరకు ఆయన దారుణ హత్యకు కారణమయ్యాయి.ఇమ్రోజ్ పత్రిక ద్వారా నిరంకుశ నిజాం పాలనను వ్యతిరేకంగా రాసినందుకు, నిజాం వ్యతిరేక ప్రజాపోరాటాలను బలపర్చినందుకు మత దురహంకారులు 1948, ఆగష్టు 22 న రజాకార్లు పత్రికా కార్యాలయం నుంచి ఇంటికి వెళుతున్న సమయంలో అతిక్రూరంగా కాల్చిచంపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం.. విషజ్వరాలకు బలవుతున్నప్రజలు

### మాజీ మంత్రి హరీష్ రావు

హైదరాబాద్ ఆగష్టు 21, (న్యూస్ పల్స్)డెంగీ, మలేరియా, గన్యా వంటి విషజ్వరాలతో రాష్ట్రం వణుకుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా లేకపోవడం శోచనీయంని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. డెంగీ జ్వరాల బారిన పడి 24 గంటల్లో ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. ప్రభుత్వ నిర్లక్ష్యం, రాష్ట్ర ప్రజలకు శాపంగా మారుతున్నది.ఇలాంటి పరిస్థితులు వస్తాయని ముందే ప్రభుత్వాన్ని హెచ్చరించాం. నిధులు విడుదల చేసి పారిశుద్ధ్య నిర్వహణ కొనసాగించాలని, ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలని వానాకాలం ప్రారంభంలోనే కోరాము. కానీ ప్రభుత్వం మా సూచనలను పెడచెవిన పెట్టింది. సకాలంలో చర్యలు తీసుకొని ఉంటే విషజ్వరాలు ఇంతగా విజృంబించేవి కావని అన్నారు.ఏటా వానాకాలం ప్రారంభంలోనే పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉంటుంది. కానీ ఈ ప్రభుత్వం మొదటి నుంచి పూర్తి నిర్లక్ష్యం వహిస్తూ వచ్చింది. ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్థాయిలో ఒక్కనాడు కూడా సమీక్ష నిర్వహించ లేదు. దోమల నివారణకు గ్రామాలు, పట్టణాల్లో స్పెషల్ డ్రైవ్ లు చేపట్టలేదు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో హైదరాబాద్ సహా అన్ని జిల్లాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. మరోవైపు పంచాయతీలకు నిధులు విడుదల చేయయపోవడంతో గ్రామాలు మురికికూపాలుగా మారుతున్నాయి. సొంత జేబుల నుంచి ఖర్చు చేస్తూ వచ్చిన పంచాయతీ కార్యదర్శులు ఇక తమ వల్ల కాదని సామూహికంగా సెలవులు పెడుతున్నారు, విధులకు దూరంగా ఉంటున్నారు.ప్రభుత్వ సమీక్షలు లేక, నిధులు విడుదల చేయక, పారిశుద్ధ్య నిర్వహణ జరగకపోవడంతో దోమలు విజృంభించి విష జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో జ్వరాల బారిన పడుతున్నారు. ప్రతి రెండు ఇండ్లలో ఒకరు వైరల్ ఫీవర్ తో బాధపడుతున్నారు.ఆసుపత్రుల్లో పడకలు దొరకని పరిస్థితి వచ్చిందంటే రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల వ్యాప్తి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించడం లేదు. మొద్దు నిద్ర వీడటం లేదు. పరిపాలనను గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రాజకీయాలు చేయడం, ప్రతిపక్ష నాయకుల మీద బురద జల్లడానికే ప్రాధాన్యమిస్తున్నది. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి పారిశుద్ధ్య నిర్వహణ, ఆసుపత్రుల సన్నద్ధత వంటి ముఖ్యమైన అంశాలపై తక్షణం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి వైరల్ ఫీవర్స్ బారిన పడి ప్రజలు ప్రాణాలు కోల్పోకుండా చూడాలని ప్రభుత్వాన్ని బిఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామని అన్నారు.



## బంగ్లాదేశ్ జైళ్లలో 37 ఏళ్లు గడిపిన తర్వాత.. భారత్‌కు తిరిగి వచ్చిన వ్యక్తి

అగర్తల: ఒక వ్యక్తి బంగ్లాదేశ్ జైళ్లలో 37 ఏళ్లు గడిపాడు. చివరకు ఒక సంస్థ సహకారంతో భారత్‌కు తిరిగి వచ్చాడు. 62 ఏళ్ల వయసులో కుటుంబ సభ్యులను కలుసుకుని సంతోషం వ్యక్తం చేశాడు. పెద్ద వాడైన కుమారుడ్ని చూసి ఆనందం పట్టలేకపోయాడు. త్రిపురలోని సెపాహిజాలా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సోనామురా సబ్‌డివిజన్‌లోని సరిహద్దు గ్రామం రవీంద్రనగర్‌లో నివసిస్తున్న 25 ఏళ్ల షాజహాన్, 1988లో బంగ్లాదేశ్ కొమిల్లాలోని తన అత్తమామల ఇంటికి వెళ్లాడు. అయితే ఆ ఇంటిపై బంగ్లాదేశ్ పోలీసులు రైడ్ చేశారు. దేశంలోకి అక్రమంగా ప్రవేశించినందుకు షాజహాన్‌ను అరెస్ట్ చేశారు. ఆ సమయంలో ఆయన భార్య గర్భవతి.కాగా, బంగ్లాదేశ్‌లోని కొమిల్లా కోర్టు షాజహాన్‌కు 11 ఏళ్లు జైలు శిక్ష విధించింది. ఆ జైలు శిక్ష ముగిసినప్పటికీ అతడ్ని విడిచిపెట్టలేదు. తప్పుడు ఆరోపణలతో ఇతర జైళ్లకు తరలించారు. దీంతో అదనంగా 26 సంవత్సరాలు బంగ్లాదేశ్ జైళ్లలో గడిపాడు. ఈ నేపథ్యంలో షాజహాన్‌కు జరిగిన అన్యాయం గురించి మీడియాలో కథనాలు వచ్చాయి. దీంతో అతడి దుస్థితి గురించి జారా ఫౌండేషన్‌కు తెలిసింది.మరోవైపు విదేశాల్లో చిక్కుకున్న వలసదారులకు సహాయం చేసే ఈ సంస్థ షాజహాన్ విడుదలకు చాలా కృషి చేసింది. అనేక చట్టపరమైన చర్యల తరువాత బంగ్లాదేశ్ పోలీసులు, అధికారులు అతడ్ని విడుదల చేశారు. దీంతో మంగళవారం శ్రీమంతపూర్ ఎల్‌సీఎస్ వద్ద బీఎస్ఎఫ్ ఇబ్బందికి ఆయనను అప్పగించారు.ఈ నేపథ్యంలో 37 ఏళ్ల తర్వాత సొంతూరుకు చేరుకున్న షాజహాన్ తన కుటుంబ సభ్యులను కలుసుకున్నాడు. పెద్ద వాడైన తన కుమారుడ్ని తొలిసారి చూసి ఆనందం పట్టలేకపోయాడు. ఈ జన్మలో ఇంటి తిరిగి వస్తానని అనుకోలేదని తెలిపాడు. తనను ఇంటికి చేర్చిన జరా ఫౌండేషన్‌కు జీవితాంతం రుణపడి ఉంటానని అన్నాడు.

## కర్ణాటక గవర్నర్ వివక్ష : సిద్ధరామయ్య ఫైర్



న్యూఢిల్లీ: ముడా స్కామ్ కేసులో తనపై ప్రాసిక్యూషన్‌కు తక్షణమే ఆమోదం తెలిపిన గవర్నర్ వివక్ష ప్రదర్శించారని కర్నాటక సీఎం సిద్ధరామయ్య ఆరోపించారు. మైనింగ్ కేసులో కేంద్ర మంత్రి, మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి విచారణకు అనుమతించడంలో మాత్రం జాప్యం చేస్తున్నారని ఇది వివక్ష కాక మరేమిటని సీఎం ప్రశ్నించారు. సిద్ధరామయ్య బుధవారం కొప్పోల్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు.తనపై ఎలాంటి దర్యాప్తు నివేదికను పరిగణనలోకి తీసుకోకుండానే గవర్నర్ సత్వరమే తన ప్రాసిక్యూషన్‌కు అనమతించారని. ఇది గవర్నర్ వివక్ష ధోరణి కాదా అని సీఎం నిలదీశారు. కాగా, కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పాలక, విపక్షాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొందని కేంద్ర మంత్రి, జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి ఆందోళన వ్యక్తం చేశారు.బెంగళూర్‌లోని జేడీఎస్ కార్యాలయంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో మంత్రి పలు వ్యాఖ్యలు చేశారు. సిద్ధరామయ్య ప్రభుత్వ వైఫల్యాలు, తప్పిదాల గురించి తాను మాట్లాడితే 2007 మైనింగ్ కేసులో తన ప్రాసిక్యూషన్‌కు అనుమతించాలని ప్రభుత్వం గవర్నర్‌ను కోరుతున్నదని వ్యాఖ్యానించారు. మరోవైపు కర్నాటక గవర్నర్‌ను కాంగ్రెస్ నేతలు అవమానిస్తున్నారని కాషాయ నేతలు చేస్తున్న విమర్శలపై కర్నాటక సీఎం సిద్ధరామయ్య స్పందించారు. గవర్నర్ తీరును ప్రశ్నిస్తే అవమానించినట్లా అని ఆయన ప్రశ్నించారు

## జార్ఖండ్‌లో విమానం మిస్సింగ్.. సెర్చ్ ఆపరేషన్‌లో ఎన్డీఆర్ఎఫ్



జెంషెడ్‌పూర్: జార్ఖండ్‌లోని సెరైకేలా-ఖార్సవాన్ జిల్లాలో.. రెండు సీట్ల విమానం అదృశ్యమైంది ఈ ఘటన మంగళవారం జరిగింది. అయితే ఆచూకీ లేని ఆ విమానం కోసం గాలింపు చేపడుతున్నారు. ఇవాళ ఎన్డీఆర్ఎఫ్ బృందం కూడా సెర్చ్ ఆపరేషన్‌లో పాల్గొన్నది. చాందిల్ డ్యామ్‌లో ఆరుగురు సభ్యుల ఎన్‌డీఆర్ఎఫ్ దళం సెర్చ్ ఆపరేషన్ మొదలుపెట్టింది. ఇప్పటి వరకు విమాన ఆనవాళ్లను గుర్తించలేదు. విమానంలోని పైలెట్, ట్రైనీ పైలట్ సమాచారం.. ఏవియేషన్ కంపెనీ వద్ద ఉంటుందని డిప్యూటీ కమిషనర్ రవిశంకర్ శుక్ల తెలిపారు. రిజర్వాయర్‌లో శిథిలాలను చూసినట్లు స్థానికులు చెప్పడంతో చాందిల్ డ్యామ్‌లో గాలింపు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. ఆల్‌కెమిస్ట్ ఏవియేషన్ కంపెనీకి చెందిన ఆ ఎయిర్‌క్రాఫ్ట్.. సెస్నా 152. జెంషెడ్‌పూర్‌లోని సొనారి ఏరోడ్రోమ్ నుంచి మంగళవారం 11 గంటలకు ఆ ఎయిర్‌క్రాఫ్ట్ ఎగిరింది.

## బద్లాపూర్ ఘటన.. ఈనెల 24న మహారాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిన మహావికాస్ అఘాడి

మహారాష్ట్రలోని థాణే జిల్లా బద్లాపూర్ లో నర్సరీ చదువుతున్న ఇద్దరు చిన్నారులపై లైంగిక వేధింపుల ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఈ ఘటనపై ప్రజల్లో ఆగ్రహజ్వాలలు పెల్లుబుకుతున్నాయి. చిన్నారులపై లైంగిక వేధింపులకు ఒడిగట్టిన కీచకుడిపై, పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ మంగళవారం ఉదయం తల్లిదండ్రులు స్థానికులు పాఠశాల వద్ద నిరసన తెలిపారు. కొందరు ఆగ్రహంతో పాఠశాలపై దాడికి పాల్పడి వస్తువులు ధ్వంసం చేశారు. అదేవిధంగా వందలాది మంది స్థానికులు రైల్వే స్టేషన్‌ను దిగ్బంధనం చేశారు.ఈ ఘటనపై స్థానిక ప్రతిపక్ష నేతలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష 'మహావికాస్ అఘాడి' కీలక నిర్ణయం తీసుకుంది. చిన్నారులపై లైంగిక దాడి ఘటనకు నిరసనగా రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చింది . ఈ మేరకు శివసేననేత సంజయ్ రౌత్ ఆగస్టు 24, శనివారం మహారాష్ట్ర బంద్ ప్రకటించారు.'త్వరలో జరగబోయే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు గురించి చర్చించబోతున్నాం. అదేవిధంగా బద్లాపూర్ ఘటన తర్వాత రాష్ట్రంలో శాంతి భద్రతలపై చర్చిస్తాం. చిన్నారులపై లైంగిక వేధింపులకు నిరసన తెలిపిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపై మహారాష్ట్ర ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మేము బద్లాపూర్ ఘటనపై ఆగస్టు 24న రాష్ట్ర బంద్‌కు పిలుపునివ్వాలని నిర్ణయించాం' అని సంజయ్ రౌత్ తెలిపారు.





## అక్టోబరు 4 నుంచి బ్రహ్మోత్సవాలు

తిరుమల, ఆగస్టు 21 తిరుమల శ్రీవారి ఆలయంలో అక్టోబర్ 4 నుంచి 12వ తేదీ వరకు నవహ్నిక సాలకట్ల బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. అక్టోబర్ 3వ తేదీ సాయంత్రం అంకురార్పణతో వేడుకలు ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 7 గంటల నుంచి 9 గంటల వరకు వాహన సేవలు ఉంటాయి.

వాహన సేవల వివరాలు :

4 అక్టోబర్ 2024: సాయంత్రం 5:45 నుంచి 6 గంటల వరకు ధ్వజారోహణం, రాత్రి 9 గంటలకు పెద్ద శేష వాహనం.

5 అక్టోబర్ 2024: ఉదయం 8 గంటలకు చిన్న శేష వాహనం, మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు స్నపనం, రాత్రి 7 గంటలకు హంస వాహనం సేవ ఉంటుంది.

6 అక్టోబర్ 2024: ఉదయం 8 గంటలకు సింహ వాహనం, మధ్యాహ్నం 1 గంటకు స్నపనం, రాత్రి 7 గంటలకు ముత్యపు పందిరి వాహనంలో శ్రీనివాసుడు ఊరేగనున్నాడు.

7 అక్టోబర్ 2024: ఉదయం 8 గంటలకు కల్పవృక్షం వాహనం, మధ్యాహ్నం 1 గంటకు స్నపనం, రాత్రి 7 గంటలకు సర్వ భూపాల వాహనంపై దర్శనమియ్యనున్నాడు.

8 అక్టోబర్ 2024: ఉదయం 8 గంటలకు మోహినీ అవతారం, సాయంత్రం 6:30 నుంచి రాత్రి 11:30 గంటల వరకు గరుడ వాహన సేవ ఉంటుంది. దీని కోసం తిరుమల దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది.

9 అక్టోబర్ 2024: ఉదయం 8 గంటలకు హనుమంత వాహనం, సాయంత్రం 4 గంటలకు స్వర్ణ రథం, రాత్రి 7 గంటలకు గజ వాహనంపై అభయం ఇవ్వనున్న శ్రీనివాసుడు.

10 అక్టోబర్ 2024: ఉదయం 8 గంటలకు సూర్యప్రభ వాహనం, రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహనం ఉంటుంది.

11 అక్టోబర్ 2024: ఉదయం 7 గంటలకు రథోత్సవం, రాత్రి 7 గంటలకు అశ్వ వాహన సేవ ఉంటుంది.

12 అక్టోబర్ 2024: ఉదయం 6 నుంచి 9 వరకు చక్రస్నానం, రాత్రి 8:30 నుంచి 10:30 వరకు ధ్వాజావరోహణంతో వేడుకలు ముగుస్తాయి.

## కిలేడీ... మాయ లేడీ

రాజమండ్రి, ఆగస్టు 21 ఆమె... వయసు మళ్లిన వారి ఇళ్లలో మాత్రమే పనిచేస్తుంది. వయోవృద్ధులకు చేదోడువాడోదుగా ఉంటుంది. అంతా తానై వృద్ధుల బాగోగులు చూసుకుంటుంది. తక్కువ కాలంలోనే ఇంట్లో మనిషిగా కలిసిపోతుంది. ఇదంతా నాణానికి ఒకవైపు. ఇంట్లో వాళ్లకు తనపై పూర్తిగా నమ్మకం కలిగాక తన అసలు రంగు బయటపెడుతుంది. మంచి టైం చూసుకుని ఇంట్లో వాళ్లకు ఆహారంలో మత్తు మందు కలిపి ఇస్తుంది. వాళు మత్తులోకి జారుకున్నాక..క్షణాల్లోనే ఇల్లు గుల్ల చేస్తుంది. వృద్ధులను లక్ష్యంగా చేసుకుని చోరీలు చేస్తున్న ఈ కిలేడిపై ఇప్పటి వరకూ తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కాకినాడ జిల్లాల్లో 18 కేసులు నమోదు అయ్యారు. 10 కేసుల్లో నేరం రుజువయ్యి జైలు జీవితం కూడా గడిపింది. అయినా ఆమె తన తీరు మార్చుకోలేదు. జైలు నుంచి విడుదలయ్యాక మళ్లీ సీన్ రిపీట్. తాజాగా రాజమహేంద్రవరం పోలీసులకు చిక్కింది. ఈ కేసుపై డీఎస్పీ భవ్యకిషోర్ రాజమహేంద్రవరంలో సోమవారం మీడియాకు వివరాలు తెలిపారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంగర గ్రామానికి చెందిన నడిపల్లి సూర్యచంద్ర చక్ర జగదాంబ అలియాస్ బుజ్జికి పెళ్లి కాగా భర్త మృతి చెందాడు. ప్రస్తుతం ఆమె రాజమండ్రిలోని బొమ్మూరులో ఒంటరిగా నివసిస్తుంది. ఇంటి పని, వంట పని బాగా చేస్తానని వృద్ధులకు మాయమాటలు చెప్పి వారి ఇళ్లలో పనిమనిషిగా చేరుతుంది. కొన్నాళ్లు నమ్మకంగా పనిచేసి... అదును చూసుకుని ఇంటి యజమానులు తినే అన్నం, తాగే పానీయాల్లో మత్తు మందు కలిపి వాళ్లు నిద్రలోకి జారుకున్నాక, వారి ఒంటి మీద నగలతో పాటు ఇంట్లో బంగారం, డబ్బుతో దోచేస్తుంది. అక్కడి నుంచి చాకచక్యంగా పరారవుతుంది. ఇలా చోరీ చేసిన బంగారు నగలను బ్యాంకులు, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల్లో తనఖా పెడుతుంది. తూర్పుగోదావరి, కాకినాడ, పశ్చిమగోదావరి జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లలో బుజ్జిపై కేసులు ఉన్నాయి. ఈ తరహా చోరీలపై నిఘా పెట్టిన పోలీసులు ఈ నెల 18న కిలేడీ బుజ్జిని అరెస్టు చేశారు. పలు దొంగతనం కేసుల్లో జైలు శిక్ష అనుభవించిన బుజ్జి 2021లో బెయిల్ పై విడుదలైంది. జైలుకెళ్లి వచ్చినా తీరు మార్చుకోకుండా అదే తరహా చోరీలకు పాల్పడింది. తాజాగా ఆమెను అరెస్టు చేసిన రాజమహేంద్రవరం పోలీసులు...ఆరు కేసులకు సంబంధించిన 273.8 గ్రాముల బంగారాన్ని సీజ్ చేశారు. ఈ కేసు ఛేదనలో ప్రతిభ చూపిన పోలీసు సిబ్బందిని డీఎస్పీ భవ్య కిషోర్ అభినందించారు. చెడ్డీ గ్యాంగ్ ఈసారి ఏపీని టార్గెట్ చేసినట్లు కనిపిస్తుంది. ఇంతకు ముందు హైదరాబాద్ లో చోరీలు చేసిన చెడ్డీ గ్యాంగ్ ఇప్పుడు ఏపీలో సీసీ కెమెరాలకు చిక్కింది. తిరుపతి జిల్లా తిరుచానూరు పరిధిలో చెడ్డీ గ్యాంగ్ కలకలం రేపింది. హైవే పక్కనే ఉన్న కొత్తపాళెం లేఅవుట్‌లోని ఒక ఇంట్లో చెడ్డీ గ్యాంగ్ చోరీ చేసింది. గోడ దూకి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు మొత్తం దోచుకెళ్లారు. చోరీ దృశ్యాలు సీసీకెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు...దర్యాప్తు ముమ్మరం చేశారు. దొంగలు బనియన్లు, డ్రాయర్లు ధరించి మారణాయుధాలతో ఇంటిలోకి రావడంతో... చెడ్డీ గ్యాంగ్ అని పోలీసులు భావిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

## రోజుకో మలుపు తిరుగుతున్న అగ్రిగోల్డ్ వ్యవహారం

విజయవాడ, ఆగస్టు 21, అగ్రిగోల్డ్ భూముల కబ్జా వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. తొలుత మాజీ మంత్రి జోగి రమేష్ కొడుకు ఉన్నట్లు వార్తలు వచ్చాయి. ఈ వ్యవహారంలో జోగి ఫ్యామిలీ ఇన్వాల్వ్ అయినట్టు తెలుస్తోంది. భూముల వ్యవహారంలో ఫోర్జరీ కోణం ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. రేపో మాపో జోగి రమేష్ ఫ్యామిలీపై ఫోర్జరీ కేసు నమోదు చేసేందుకు సిద్దమవుతోంది సీఐడీ. జోగి రమేష్‌కి తాను స్థలం అమ్మలేదని సీఐడీకి వాంగ్మూలం ఇచ్చారు సంబంధిత వ్యక్తి పోలవరపు మురళీమోహన్. డాక్యుమెంట్లు, ఆధార్ కార్డు తనవి కావని అంటున్నారాయన. వాస్తవానికి సర్వేనెంబరు 88లో 4 ఎకరాలు వెంటకచలమారెడ్డి పేరుపై ఉంది. అందులో ఓ ఎకరం పోలవరపు మురళీమోహన్, మరొకటి అద్దేపల్లి కిరణ్ కుమార్‌కు.. రెండు ఎకరాలు రామిశెట్టి రాంబాబుకు 2001లో విక్రయించారుపోలవరపు మురళీమోహన్ తన ఎకరం స్థలాన్ని ప్లాటులుగా విభజించి 2003, 2004లో 11 మందికి విక్రయించాడు. పోలవరపు మురళీమోహన్.. జోగి వెంకటేశ్వరరావు, జోగి రాజీవ్‌లకు ల్యాండ్ విక్రయించిన ట్టు రెండేళ్ల కిందట రిజిస్ట్రేషన్లు అయ్యాయి. దర్యాప్తు అధికారులు పోలవరపు మురళీమోహన్‌ను నిందితుడిగా చేర్చారు. అధికారుల విచారణలో అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.

## అధికారుల్లో దడ......

నెల్లూరు, ఆగస్టు 21, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు దడ లేపుతున్నారు. ఆయన పర్యటనలు అంటేనే అధికారులు హడలెత్తిపోతున్నారు. ఎప్పుడు ఏ సమాచారం అడుగుతారో అన్న టెన్షన్ అధికారుల్లో ఉంది. 2014 లో ముఖ్యమంత్రి బాధ్యతలను చేపట్టిన చంద్రబాబుకు, ఇప్పటి చంద్రబాబుకు అసలు పొంతనే లేదు. పూర్తిగా వయొలెంట్ గా మారిపోయారు. ఆయన చెప్పినట్లుగానే 1995 నాటి ముఖ్యమంత్రిని నేడు చూస్తారంటూ వార్నింగ్ లు ఇస్తున్నారు. బీకేర్‌ఫుల్ అంటూ గట్టిగా హెచ్చరికలు జారీ చేస్తూ అధికారులు ఒళ్లు దగ్గరపెట్టుకుని పనిచేయాలంటూ చంద్రబాబు అంటుండటంతో వణికిపోతున్నారుచంద్రబాబు నాయుడు 1995లో ముఖ్యమంత్రిగా బాధ్యతలను చేపట్టినప్పుడు ఆయన దూకుడుగా వెళ్లారు. ఆకస్మిక తనిఖీలు చేశారు. అధికారులను నిద్ర పోనివ్వ లేదు. దీంతో పాటు సస్పెన్షన్లు కూడా నాడు ఎక్కువ చేశారు. నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునేది లేదని ఆయన నాడు చెబుతూ వైద్యం, విద్యం వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి పెట్టేవారు. అప్పట్లో చంద్రబాబు నాయుడు వస్తున్నారంటే గుండెపోటుకు గురైన అధికారులు కూడా అనేక మంది ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఆ తర్వాత ఆయన కొంత దూకుడు తగ్గించారు. 1999లో అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధిపైనే దృష్టి పెట్టడంతో కొంత అధికారులు మళ్లీ ఊపిరి పీల్చుకున్నారు. కానీ నాటి చంద్రబాబు నాయుడును అధికారులు గుర్తుకు తెచ్చుకుని మరీ భయపడిపోతున్నారు. అయితే నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్.. నేడు విడిపోయిన ఆంధ్రప్రదేశ్. తేడా లేకపోయినా ఒక విషయంలో మాత్రం కొంత అధికారులు క్లారిటీ ఇచ్చేందుకు అవస్థలు పడుతున్నారు. నాడు నిధులు పుష్కలంగా ఉండేవి. చెప్పిన పనులు వెంటనే చేసేవారు. ఇచ్చిన ఆదేశాలను వెంటనే అమలు చేసేవారు. కానీ ఇప్పుడు నిధులు లేవు. దీంతో డబ్బులు లేకుండా ఏం చేయాలని అధికారులు ప్రశ్నించే పరిస్థితికి వచ్చింది. అయినా ఆయనను నేరుగా ప్రశ్నించలేక మంత్రులు, ఎమ్మెల్యేలకు తమ గోడును చెప్పుకుంటున్నారు. చంద్రబాబు పాత ముఖ్యమంత్రిగా మారితే తప్పులేదు. కానీ అదే సమయంలో అధికారులు పనులు చేయలేకపోవడానికి గల కారణాలను కూడా ఆయన కనుక్కొని ఫైర్ అయితే బాగుంటుందని అంటున్నారు. నిన్న నెల్లూరు జిల్లాకు వెళ్లిన చంద్రబాబు అక్కడి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడంపై అధికార వర్గాల్లో చర్చ జరుగుతుంది. ప్రజల పన్ను సొమ్ముతో జీతాలు తీసుకుంటున్న అధికారులు, ఉద్యోగులు కనీసం సమస్యలను అడ్రెస్ చేయకుండా పట్టించుకోకుండా నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడాన్ని టీడీపీ నేతలు తప్పుపడుతున్నారు. చంద్రబాబు వార్నింగ్ ఇచ్చిన దాంట్లో తప్పేముందని, అధికారులు ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేస్తేనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని అంటున్నారు. మొత్తం మీద చంద్రబాబు జిల్లాల పర్యటనకు వస్తున్నారంటే అధికారుల్లో దడ మొదలయింది.

## డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం. డివైఎఫ్ఐ

### మత్తు వద్దు బిడజ్వాల భవిష్యత్తు ముద్దు

బద్వేలు ఆగస్టు 21 డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరం పాటుపడదమని బద్వేల్ అర్బన్ ఎస్ఐ రవికుమార్ పిలుపునిచ్చారు. డివైఎఫ్ఐ యువజన సంఘం ఆధ్వర్యంలో కడప జిల్లా కమిటీ ముద్రించిన మాదకద్రవ్యాల నిర్మూలపై ముద్రించిన పోస్టర్స్ ను బద్వేల్ అర్బన్ ఎస్ఐ రవికుమార్ ఆవిష్కరించారు. బుధవారం స్థానిక అర్బన్ పోలీస్ ఆవరణంలో వాల్ పోస్టర్స్ ఆవిష్కరించారు ఈ సందర్భంగా బద్వేల్ అర్బన్ ఎస్ఐ రవికుమార్ మాట్లాడుతూ.... యువత మత్తు, మాదకద్రవ్యాల వంటి వాటి జోలికి వెళ్లవద్దని వాటికి దూరంగా వుండాలన్నారు. యువత ఇటువంటి వాటి మోజులో పడి చెడు వ్యసనాలకు అలవాటుపడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దు అని అన్నారు. ఇప్పటికే జిల్లా లో గంజాయి, మత్తు పదార్థాల వంటి వాటిని అరికట్టడానికి పోలీసు యంత్రాంగం ఉక్కుపాదం మోపామని వారు అన్నారు. యువత చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా స్వమార్గంలో నడిచి మంచి భవిష్యత్ తో నడిచి డ్రగ్స్‌రహిత జిల్లా గా నిర్మిద్దామని యువత డ్రగ్స్ రహిత ఉద్యమంలో కలసి రావాలని పిలుపునిచ్చారు. ముందుగా ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ సంఘానికి, నాయకత్వానికి అభినందనలు తెలుపుతున్నాను అని అన్నారు. ఇటువంటి మత్తుపదార్థాల వంటివి వాడిన, అమ్మిన కఠిన శిక్షలు అమలు చేయబడునని యువత తమ ఉజ్వల భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని, మత్తు మాయలో పడోద్దని కోరుతున్నామన్నారు. మరిన్ని ఇటువంటి అవగాహన కార్యక్రమలు నిర్వహించి యువతను చైతన్యవంతం చేయాలని కోరుతున్నామని అన్నారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం. చిన్ని, మాట్లాడుతూ యువతను డ్రగ్స్, మత్తు పదార్థాల వంటి చెడు వ్యసనాల వైపు నుండి మంచి సన్మార్గం వైపు నడవడం కోసం డివైఎఫ్ఐ యువజన సంఘం అవగాహన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ గంజాయి వంటి వాటికి యువత అలవాటు పడి నిండు జీవితాన్ని భావితరాల యువత నాశనం చేసుకుంటున్నారు అన్నారు. మరికొందరు యువకులు బెట్టింగ్‌లకుఅలవాటు పడి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని బెట్టింగ్ యాప్ లకు యువకులు ధూరంగా ఉండాలన్నారు. ఈ మధ్యకాలంలో ఎక్కువగా విద్యార్థులు కూడా గంజాయికి అలవాటు పడుతున్నారని గంజాయి కేసుల్లో విద్యార్థులు, యువకులు అధికముగా ఉన్నారని వారు తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరం పాటు పడదామని వారు అన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ నాయకులు ఎస్కే మస్తాన్ షరీఫ్ ఎస్ కే ఆదిల్ ఎస్కే ఖలీల్ ఎస్కే షబ్బీర్ మహిళా కోకన్వీనర్లు నాగలక్ష్మి నాగేశ్వరి ఎస్.కె ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

## దోషుల్ని కఠినంగా శిక్షించాలని మానవహారం

పరవాడ,మండల కేంద్రం అయ్యిన పరవాడలో బుధవారం పరవాడ పోలీస్ స్టేషన్ ఎదుట గాజువాక ఎలమంచిలి మెయిన్ రోడ్డు పై సీఐటీయూ, సఫీ , ఐద్వా ఆధ్వర్యంలో మానవహారం చేపట్టారు. అత్యాచారానికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తక్షణమే తీసుకుని శిక్షించాలని నినాదాలు చేశారు. బెంగాల్ ప్రభుత్వం అసలు దోసులను దాచి పెడుతూ, ఒక్కరినీ మాత్రం అరెస్టు చేయటం దుర్మార్గం అని, మహిళలకు ఎక్కడ రక్షణ లేకుండా పోతుందని, పని ప్రదేశాల్లో నే కాకుండా, ఇంట్లో కూడా రక్షణ లేకుండా పోతుందని కనీసం ప్రభుత్వాలు కఠినమైన చర్యలు తీసుకోవాలని, మహిళలకు పిల్లలకు రక్షణ కల్పించాలని, మహిళలపై జరుగుతున్న ఈ అత్యాచారాలు భారతావని సిగ్గుపడేలా ఉన్నాయని, దోషులను కఠినంగా శిక్షించేంతవరకు పోరాటాలు సాగుతూనే ఉంటాయని, గతంలో ఢిల్లీ నడిబొడ్డులో జరిగిన నిర్భయ లాంటి ఘటనలు ఎన్ని జరిగినా నేరస్తులకు కఠినమైన శిక్షలు పడటం లేదని ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ అన్నారు. వేలాదిమంది ప్రాణాలు కాపాడిన డాక్టర్ కే ప్రాణరక్షణ లేకుండా పోయిందని అన్నారు. ఈ దేశంలో గోవులకు రక్షణ చట్టం ఉందని కానీ దేశవ్యాప్తంగా మహిళా ప్రొటెక్షన్ యాక్ట్ లేకపోవడం విచారకరమన్నారు దోసెలను కఠినంగా శిక్షించి చర్యలు తీసుకోకపోతే భారీ ఎత్తున ఆందోళన చేపడతామని గని శెట్టి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కే ప్రశాంతి, పి అనిత, కే లావణ్య,బి గౌరీ,వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీశైలం జలాశయం వద్ద విరిగిపడ్డ కొండచరియలు .. తప్పిన ప్రమాదం

అమరావతి : నంద్యాల జిల్లా శ్రీశైలం జలాశయం వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. మండలంలో కురిసిన కుంభవృష్టి వర్షానికి రాత్రి కొండ చరియలు విరిగి పెద్ద బండరాళ్లు ఘాట్‌రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. రాత్రి కారణంగా రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఉదయం గమనించిన ప్రయాణికులు జిల్లా అధికారులకు సమాచారం అందజేయడంతో రోడ్డుకు అడ్డంగా ఉన్న బండరాళ్లను తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. రాత్రి నుంచి పరిసర ప్రాంతాల్లో ఎడతెరుపు లేకుండా కుండపోత వర్షం కురుస్తోంది.



శ్రీశైలం జలాశయం దిగువన రహదారి మార్గంలో రోడ్డుకు అడ్డంగా కొండ చరియలు విరిగిపడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలోనూ పలుమార్లు కొండచరియలు విరిగిపడిన సంఘటనలు ఉన్నాయి. ప్రమాదాలు జరుగకముందే అధికారులు కొండచరియలు విరిగిపడక ముందే జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ప్రేమజంట పై దాడి

పి గన్నవరం,అంబేద్కర్ కోనసీమ జిల్లా పి. గన్నవరం లో ప్రేమ పెళ్ళి చేసుకున్న జంటపై అమ్మాయి తండ్రి దాడి చేసాడు. పశ్చిమ గోదావరి జిల్లా కొడేరు లంకకు చెందిన రమేష్ ,పి. గన్నవరం మండలం ఒ. గన్నవరం కు చెందిన కొప్పడి వరాలు ప్రేమ పెళ్ళి చేసుకుని పోలీసులను ఆశ్రయించారు. ఇద్దరికి మైనారిటీ తీరడంతోపోలీసులు ఇద్దరు పెద్దలకు చెప్పి అబ్బాయి కుటుంబ సభ్యులకి అప్పగించారు. మంగళవారం రాత్రి అమ్మాయి తండ్రి వెంకటరమణ పశ్చిమ గోదావరి జిల్లా కొడేరులంక అబ్బాయి ఇంటికి వెళ్ళి పెళ్ళి కొడుకు,పెళ్ళి కూతురి తోపాటు కుటుంబ సభ్యులపై కూడా తెచ్చుకున్న కత్తి తో దాడి చేసాడు. ఘటనలో పెళ్ళి కూతురు, పెళ్ళి కొడుకు, పెళ్ళి కొడుకు తల్లి,చెల్లికి గాయాలుఅయ్యాయి. వారికి పి.గన్నరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చీరాల లోభారత్ బంద్

ఒంగోలు, బాపట్ల జిల్లా చీరాల లో ఎస్సీ వర్గీకరణ పై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా దళిత సంఘాలు భారత్ బంద్ కు పిలుపు నిచ్చాయి. తెల్లవారుజాము నుండే బంద్ ప్రభావం మొదలైంది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎస్సీ ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి బస్సులను అడ్డుకొని రోడ్డు పై బైఠాయించి ఆందోళనకు దిగారు. దీనితో తాత్కాలికంగా ఆర్టీసీ సర్వీసులను నిలిపివేశారు. ఇప్పటికే పలు స్కూల్స్, కాలేజీలు, వ్యాపార సంస్థలు మూసివేసి బంద్ కు మద్దతు ప్రకటించారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## జిల్లాలో ప్రశాంతంగా బంద్

కాకినాడ.యాంకర్: ఎస్ సి రిజర్వేషన్ల వర్గీకరణ పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ మాల మహానాడు, ఆర్.టి.ఐ తదితర సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహిస్తున్న బంద్ జిల్లాలో ప్రశాంతంగా జరుగుతోంది. వాయిస్: రిపబ్లిక్ కెన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు పిట్టా వరప్రసాద్, మాల మహానాడు జేఏసీ కన్వీనర్ సిద్ధాంతుల కొండబాబు, కాకినాడ పార్లమెంట్ ఇంచార్జ్ ఏనుగుపల్లి కృష్ణ తదితరుల ఆధ్వర్యంలో ఎస్ సి సంఘాల నాయకులు కాకినాడలో పర్యటిస్తూ ఎక్కడికక్కడ బంద్ చేయిస్తున్నారు. ఆర్టీసీ బస్సులు తిరగకుండా ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ధర్నా నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. కాకినాడ జిల్లాపై బంద్ ప్రభావం కనిపిస్తోంది.

## ఇంట్లో దూరిన భారీ రక్త పింజరి పాము

అమలాపురం. అమలాపురం మండలం ఇందుపల్లి అరవగరువు లో శిష్ట సోమ సుందరం ఇంట్లో రక్తపింజరి నీ స్నేక్ క్యాచర్ గణేష్ వర్మ పట్టుకున్నారు. భారీ రక్త పింజరి కావడంతో దాన్ని స్నేక్ క్యాచర్ గణేష్ వర్మ చాకచక్యంగా బంధించారు. భారీ రక్తపింజరి కావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వర్షాకాల సమయంలో రాత్రి వేళల్లో రక్తపింజర్లు ఆహారం కోసం సంచరిస్తాయని స్నేక్ కేచర వర్మ చెప్పారు. ఎటువంటి పాములు అయినా సరే ఇళ్లల్లోకి ప్రవేశిస్తే తనకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. 9949956232 నెంబర్ కి ఫోన్ చేయాలని ఆయన కోరారు.

## రాయదుర్గంలో భారీ వర్షం..నీటమునిగిన పంటలు

రాయదుర్గం రాయదుర్గం నియోజకవర్గం పరిధిలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాయదుర్గం మండలం లో 85.4 ఎ.ఎ వర్షపాతం నమోదయింది . పట్టణంలో లోతట్టు ప్రాంతాలు, రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఇళ్లల్లోకి నీరు చేరడంతో ప్రజల తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రాయదుర్గం పట్టణ లక్ష్మి బజార్ ప్రధాన ప్రధాన రహదారిపై ఉన్న షాపుల్లో వర్షం నీరు పోవడంతో భారీ ఆస్తి నష్టం జరిగింది. వాగులు, వంకలు పొంగిపొర్లడంతో రైతులు హర్షం చేస్తున్నారు. పలు చెరువుల్లోకి వర్షపు నీరు చేరాయి. రైతులు సాగుచేసిన మొక్కజొన్న, పత్తి, టమాట, మిరప , తమలపాకు వంటి ఉద్యాన పంటలు నీటమునిగి దెబ్బతిన్నాయి.

## ఎమ్మిగనూరు బంద్ ప్రశాంతం ...

- వర్గీకరణ కోసం ప్రాణాలు అర్పిస్తాం
- ఉద్యమంతో వర్గీకరణ అడ్డుకుంటాం
- మాల మహానాడు నాయకుల డిమాండ్

ఎమ్మిగనూరు ఆగస్టు 21 పట్టణంలోని స్థానిక ప్రభుత్వ, ప్రయివేట్ సంస్థలనందు భారీగా మాల మహానాడు నాయకులు పాల్గొని ప్రశాంతంగా బంద్ చేయడం జరిగింది. బందుకు సహకరించిన వాళ్ళందరికీ ధన్యవాదాలు తెలిపిన మాల మహానాడు నాయకులు. రాజకీయ స్వలాభం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లు వర్గీకరణ చేయడం జరిగిందని, రాజకీయ ఎత్తుగడలతో అన్నదమ్ముల లాంటి ఎస్సీలను విభజించడం జరిగిందని తెలిపారు. ఇలా ఎస్సీ వర్గీయులు 59 ఉపకలాలను వారి స్వలాభం కోసం విభజించి పాలిస్తున్నారని తెలిపారు. వర్గీకరణ వ్యతిరేకం కోసం మాల మహానాడు నాయకులు ప్రాణాలైనా అర్పిస్తామని తెలిపారు. గతంలో సుప్రీంకోర్టు ఉష మొహరం కమిషన్ ద్వారా తీర్పు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాజకీయ స్వలాభం కోసమే వర్గీకరణ చేయడం జరిగిందని, ఇలాంటి వర్గీకరణలను కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల. నరసన్న, మాల మహానాడు నాయకులు మాల పంపయ్య, మాల రాజోలప్ప, ఎద్దుల చెన్నయ్య, మాల మధుబాబు, మాల. మురళీకృష్ణ, బుడుమెద్దుల రవిచంద్ర, మాల నరసప్ప, గడ్డం నాగేంద్ర, మాల సత్యనారాయణ, మాల జట్టప్ప, సలువాది.సురేంద్ర కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సింహాచలం వరాహలక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న మంత్రి కొల్లు రవీంద్ర

విశాఖపట్నం,సింహాచలం వరాహ లక్ష్మీ నరసింహస్వామిని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర దర్శించుకున్నారు. మంత్రికి ఆలయ ఈవో ఘన స్వాగతం పలికారు. మంత్రి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. చందనోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వాదం ఇచ్చారు. స్వామివారి చిత్ర పటం, ప్రసాదం అందించారు.


## ఆయుర్వేద వైద్యంలో అశ్వగంధ మూలికకు ప్రాముఖ్యత , అశ్వగంద మూలిక వలన క్యాన్సర్, మానసిక ఒత్తిడి, నరాల బలహీనత తగ్గిస్తుంది

### అశ్వగంధ విత్తనాల పంపిణీ చేసిన డిప్యూటీ డైరెక్టర్ కె జయమ్మ



విభారే న్యూస్ ఆగస్టు 21కర్నూల్ ప్రతినిధి. బుధవారం కలెక్టరేట్లో కర్నూల్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అశ్వగంధ మూలిక (పెన్నేరు గడ్డ విత్తనాలు) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కె జయమ్మ మాట్లాడుతూ అశ్వగంధ మూలిక ఏదైనా వైద్యులకు పరిష్కారంలేని రోగాలకు సైతం ఈ మందు ఉపయోగపడుతుంద న్నారు. ఇది మధుమేహం ఉన్నవాళ్లు అశ్వగంధ చూర్ణం పాలతో లేదా వేడి నీళ్లలో వేసుకొని తాగితే మంచి ఫలితాలు ఇస్తుందన్నారు. మధుమేహం ఉన్న వాళ్ళు అశ్వగంధ లేహం వాడాలన్నారు. అంతేకాక నరాల బలహీనత, మోకాళ్ళ నొప్పులు, బిపి, మానసిక ఒత్తిడిలు లాంటి తదితర రోగాలను తగ్గిస్తుందని తెలిపారు. అశ్వం అంటే గుర్రం, గంధ వాసన అశ్వగంధి గుర్రం చమట వాసన వస్తుందన్నారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షులు సీనియర్ జర్నలిస్ట్ ఏ ఐజక్ మాట్లాడుతూ అశ్వగంధ సేవిస్తే లాభం ఈ చూర్ణం అల్జీమర్స్ (మతిమరుపు) క్యాన్సర్, మోకాళ్ళ నొప్పులు, రక్త ప్రాసన వ్యవస్థ కు కూడా పనిచేస్తుందన్నారు. ధరల విషయంలో అలాగే ఉత్పత్తి లో మన రైతులు పొలంలో సాగు చేస్తూ అధిక లాభాలు అర్జిస్తున్నారని తెలిపారు. విదేశాలకు సైతం ఎగుమతులు జరుగుతున్నాయి. ధరల విషయంలో రైతులు అధిక లాభం పొందుతున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు సామెల్, ఫోటోగ్రాఫర్ కరణ్ ,సుధాకర్, అసోసియేషన్ కోశాధికారి సురేష్, మధు, అడ్వకేట్లు చిట్టన్న మరియు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆళ్లగడ్డ నూతన డిఎస్పీగా రవికుమార్ పదవీ బాధ్యతలు...



ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 21 విభారె న్యూస్:-ఆళ్లగడ్డ పోలీస్ సబ్ డివిజన్ నూతన డీ.ఎస్పీగా రవికుమార్ బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు తాను ఆళ్లగడ్డ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో డీఎస్పీగా బాధ్యతలు చేపట్టడం జరిగిందన్నారు. సబ్ డివిజన్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా గట్టి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా టౌన్ సిఐ చిరంజీవి, రూరల్ సీఐ కంబగిరి రాముడు, టౌన్ ఎస్ఐ షేక్ నగీనా నూతన డిఎస్పీ ని కలిసి అభినందనలు తెలియజేశారు.

## 22వ తేదీ గురువారం శ్రీ సూర్య దేవాలయంలో సంకష్టహర చతుర్థి వ్రతం...

కర్నూలు జిల్లా ప్రతినిధి ఆగష్టు 21 విభారె న్యూస్..సంకష్టహర చతుర్థి వ్రతం 22-08-2024 గురువారంశ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారికి సంకష్టహర చతుర్థి వ్రతం జరుగును వారాలలో బుధవారము తిథులలో చవితి వరసిద్ధి వినాయక స్వామి వారికి అత్యంత ప్రీతికరమైనవి ఇలా బుధవారంతో కూడిన చెవితి కలిసి రావడం ఎంతో శుభము కనుక ఈ రోజున వరసిద్ధి వినాయక స్వామి వారిని పూజిస్తే అనుకున్న పనులు వెంటనే జరుగుతాయి ఏ కార్యం తలపెట్టిన అవిఘ్నాలు రావు ఈ రోజున స్వామివారికి ఉదయం పంచామృత అభిషేకాలు, 10 గంటలకు లక్ష్మీ గణపతి మూల మంత్ర సహిత లక్ష్మి గణపతి హోమం జరుగును.సాయంకాలము చంద్రోదయం న సంకష్టహర చతుర్థి వ్రతము జరుగును.అభిషేకం 200 /-కళ్యాణ గణపతి హోమం 3500 /-సంకటహర చతుర్థి వ్రతం 200 /-హోమ సంకల్పం 116 /- సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లువి నయ్ కుమార్ శర్మ8919495919దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు:8896123777




## భారీ వర్షాల కారణంగా తహసీల్దార్లు, వ్యవసాయ శాఖ అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు గ్రామాలకు వెళ్లండివరద నీరు వచ్చిన గ్రామాలలో శానిటేషన్, వ్యాధుల నివారణకు తగిన చర్యలు చేపట్టండి నదులు, వాగులు, వంకల లోకి ప్రజలు వెళ్లకుండా అప్రమత్తం చేయండిజిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

విభారే న్యూస్కర్నూలు, ప్రతినిధి. ఆగస్టు 21:- జిల్లాలో భారీ వర్షాల కారణంగా పలు గ్రామాల్లో వరద నీరు వచ్చినందున తహసీల్దార్లు, వ్యవసాయ శాఖ అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు గ్రామాలకు వెళ్లి పరిస్థితిని పరిశీలించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. బుధవారం ఉదయం భారీ వర్షం కారణంగా నెలకొన్న పరిస్థితులపై మండల స్పెషల్ ఆఫీసర్లు , మునిసిపల్ కమిషనర్ లు,తహశీల్దార్లు, ఎంపిడిఓలు, సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత రెండు రోజుల నుండి భారీ వర్షాలు కురవడంతో కొన్ని మండలాలలోని వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించడం జరిగిందన్నారు. గత రాత్రి హంద్రీ నదిలో చిక్కుకున్న కూలీలను రక్షించేందుకు తగిన చర్యలు చేపట్టామన్నారు..వర్షాల కారణంగా దాదాపుగా 7 మండలాలలో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా నివేదికలు ఇచ్చారన్నారు.. తహసిల్దార్ లు, మండల స్పెషల్ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వరద పరిస్థితులను తెలుసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.. ఆర్డీవోలు డివిజన్ స్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. వరద నీరు వచ్చిన గ్రామాలలో పంచాయతీ సెక్రటరీల ద్వారా శానిటేషన్ చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిపిఓ ను ఆదేశించారు. అదే విధంగా అంటువ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని, నీటిని వేడి చేసుకొని తాగే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ వైద్యశాఖ అధికారులను ఆదేశించారు.. ప్రస్తుతం ఆయా డివిజన్ లలో పరిస్థితి ఎలా ఉంది? వర్షపు నీరు ఇళ్లల్లోకి వెళ్లాయా? అని సంబంధిత ఆర్డిఓ లను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. వాతావరణ శాఖ నివేదిక ప్రకారం ఈరోజు కూడా వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రజలు ఎవ్వరూ నదులు, వాగులు, వంకలు లోకి వెళ్లకుండా విఆర్ఓ లు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆర్డీఓ లకు సూచించారు. అవసరమనుకుంటే పోలీస్ శాఖతో మాట్లాడి ఎస్ డి ఆర్ఎఫ్ టీమ్ లను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. హంద్రీ నదీ ప్రవాహం గురించి ఇరిగేషన్ ఎస్సీ రెడ్డి శేఖర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు.. ప్రస్తుతం నీటి ప్రవాహం నియంత్రణలో ఉందా, గాజులదిన్నె రిజర్వాయర్ లోకి నీటి చేరిక తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు..నిన్న ఉదయం 20 వేల క్యూసెక్కుల ఉన్న నీరు, ప్రస్తుతం 5 వేల క్యూసెక్కులు మాత్రమే ఉందని,గాజుల దిన్నె రిజర్వాయర్ లో 0.6 టిఎంసి పెరిగిందని, పరిస్థితి నియంత్రణ లో ఉందని ఎస్ ఈ వివరించారు..హాలహర్వి, కౌతాళం, పత్తికొండ, ఆస్పరి, మంత్రాలయం, దేవనకొండ, ఆలూరు మండలాల తహశీల్దార్ల తో మాట్లాడారు..

ఆయా గ్రామాల్లో నెలకొన్న పరిస్థితి తీసుకుంటున్న చర్యల గురించి తహసిల్దార్లు కలెక్టర్కు వివరించారు. వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని, పంట నష్టం వివరాలను పంపించాలని సంబంధిత మండల తహసీల్దార్ లను కలెక్టర్ ఆదేశించారు. పంట నష్టం గురించి కలెక్టర్ జిల్లా వ్యవసాయ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక నివేదిక ప్రకారం 7 మండలాల్లో 35 గ్రామాల్లో పంట నష్టం అయిందని, ఇప్పటివరకు 4 వేల 405 హెక్టార్లలో పంటలు మునకకు గురయ్యాయని, నీరు తగ్గితే పంట నష్టం తగ్గే అవకాశం ఉంటుందని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.. పంటల్లో చేరిన వర్షపు నీటిని తగ్గించేందుకు ఉపాధి హామీ కింద పనులు చేయించాలని, పంట నష్టం గురించి అసెస్మెంట్ చేసి వివరాలను పంపాలని కలెక్టర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, పత్తికొండ ఆర్టిఓ రామలక్ష్మి, డిపిఓ నాగరాజు నాయుడు, మండల స్పెషల్ ఆఫీసర్లు, తహసిల్దార్లు, ఎంపిడిఓ లు తదితరులు పాల్గొన్నార

## రేమట పెండింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని యంపీ బస్తిపాటి నాగరాజును కలిసిన ఆర్వీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాయలసీమ రవికుమార్

### తక్షణమే స్పందించి ఆర్ అండ్ బి ఎస్ఈ నాగరాజుతో చర్చించిన యంపీ.సమస్యను పరిష్కరిస్తామని యంపీ హామీ



విభారే న్యూస్. ఆగస్టు 21 కర్నూల్ ప్రతినిధి :కర్నూలు నగరంలో నుండి ఉల్చాల మీదుగా రేమట గ్రామానికి రహదారి పెండింగ్ పనులను పూర్తి చేయాలని కర్నూలు యంపీ బస్తిపాటి నాగరాజును రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాయలసీమ రవికుమార్ కలిసి విన్నవించారు తక్షణమే స్పందించిన యంపీ ఆర్ అండ్ బీ ఎస్ఈ నాగరాజుతో చరవాణి ద్వారా సంప్రదించారు యంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ గతంలో పూర్తిచేయాల్సిన రహదారి పెండింగ్ ఎందుకు ఉందని అడిగి తెలుసుకుని రేమట రోడ్డు నిర్మాణ పనులకు ప్రభుత్వం ద్వారా చేయించాల్సిన పనులను తాను చేయించడానికి సిద్దంగా ఉన్నానని ఏదైనా సమస్యవుంటే తమను సంప్రదించి పెండింగ్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ ఎస్ఈ కి తెలిపారు త్వరలోనే రేమట గ్రామానికి పెండింగులో వున్న రోడ్డు నిర్మాణం చేపడతామని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాయలసీమ రవికుమార్ కు హామీ ఇచ్చారు. అనంతరం రాయలసీమ రవికుమార్ మాట్లాడుతూ రాయలసీమ విద్యార్థి పోరాట సమితి పోరా టాల ఫలితంగా ఉల్చాల నుండి రేమట మీదుగా కొత్తకోట వరకు రోడ్డు నిర్మాణపనులను చేపట్టారని ప్రజా రవాణా అధికంగా ఉండే రేమట కర్నూలు మధ్య రోడ్డును పెండింగ్ ఉంచడం వల్ల ఆ రోడ్డుపై ప్రయాణించే వందలాది వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి తరపున ఎన్నోసార్లు వినతులు ఇచ్చిన స్పందన ఉండేది కాదని మూడున్నర సంవత్సరాల కు పైగానే ఆ రోడ్డు నిర్మాణం కోసం రాయలసీమ విద్యార్థి పోరాట సమితి పోరాటాలు చేయాల్సివచ్చిందని అయితే ప్రస్తుత కర్నూలు యంపీ బస్తిపాటి నాగరాజు గారిని కలిసి సమస్యను తెలిపిన వెంటనే స్పందించి ఆర్ అండ్ బి ఎన్ ఈతో మాట్లాడటం జరిగిందని అందుకు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ విద్యార్థి పోరాట సమితి జిల్లా అధ్యక్షులు అశోక్,సురేష్,వసంత్,విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## తెల్లబండ్లరాఘన్న గుండె పోటు తో మృతి

### సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, ప్రాణేష్ లను పరామర్శించిన ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి



మంత్రాలయం రాంపురం రెడ్డి సోదరుల కుటుంబానికి వీర విధేయుడిగా ఉన్న తెల్లబండ్ల రాఘన్న(66) బుధవారం ఉదయం గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి , వైస్సార్సీపీ మండల అధ్యక్షులు జి. భీమారెడ్డి, బావి రెడ్డి, పెట్రోలు బంకు శ్రీనివాసులు రాఘన్న భౌతిక కాయం కు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, ప్రాణేష్ లను పరామర్శించి ధైర్యంగా ఉండాలని మేము అండగా ఉన్నాం కదా అంటూ భరోసా కల్పించారు. అదే విధంగా తెల్లబండ్ల రాఘన్న తో ఉన్న అనుబంధాన్ని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి గుర్తు చేసుకుని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. అదే విధంగా పెద్దాయన మాజీ టీటీడీ పాలకమండలి సభ్యులు వై. సీతారామరెడ్డి,వైస్సార్సీపీ నేతలు వై. ప్రదీప్ రెడ్డి,వై. ధరణి రెడ్డి ఫోన్లో సర్పంచ్ ను పరామర్శించి ధైర్యం గా ఉండాలన్నారు. వీరితో పాటు జడ్పీటీసీ సభ్యులు మజ్జిగ గోవిందమ్మ కుమారుడు మజ్జిగ రోగ్గప్ప, బొజ్జప్ప, రవి రెడ్డి, గ్రామానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, పెద్దలు రాఘన్న భౌతిక కాయం కు పూలమాలలు నివాళులర్పించారు.

## హంద్రీ వాగు వరద వలన నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి....

### పంట నష్టపోయిన గ్రామాల్లో సిపిఎం పార్టీ బృందం పంటల పరిశీలన -రైతులను ఆదుకోవాలని జెసికి వినతిపత్రం అందజేసిన సిపిఎం నాయకులు

దేవనకొండ ఆగస్టు 21 ఆలూరు,పత్తికొండ నియోజకవర్గ లలో పై ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు హంద్రీ వాగు పొంగిపొర్లిన నేపథ్యంలో హంద్రీ వాగు కు ఇరువైపులా ఉన్నటువంటి పంట పొలాలకు తీవ్ర నష్టం జరిగిందని హంద్రీ పరివాహక ప్రాంతంలో రైతులకు భారీగా నష్టం జరిగిందని నష్టపోయిన రైతన్నకి ఎకరాకు 50 వేల పరిహారం ఇచ్చి ఆదుకోవాలని సిపిఎం పార్టీ జిల్లా నాయకులు శేఖర్ డిమాండ్ చేశారు.బుధవారం నాడు సిపిఎం పార్టీ మండల కమిటీ బృందం నష్టపోయిన పంట పొలాలను పరిశీలించారు ఈ సందర్భంగా వీరశేఖర్ మాట్లాడుతూ హంద్రీ వాగు వరద వలన పొలాలలో దాదాపుగా అడుగు నుండి నాలుగు అడుగుల మేర నీటి ప్రవాహం ప్రవహించిందని ఈ ప్రవాహం వలన పంట పొలాలలో విపరీతంగా బురద,మేట పెట్టడం వలన పంటలు చాలా తీవ్రంగా దెబ్బతిన్నాయి ఇప్పటికీ కొన్ని పంటలలో నీరు నిలిచి ఉందని ఈ పంటలు కుళ్ళిపోయేటువంటి ప్రమాదం ఉందని పత్తి మొదటి కాపు బాగా వచ్చిందని కాయలు, పూత బాగా ఉందని ఆనందపడిన రైతుకు వరద నిరాశ మిగిల్చిందని






పేర్కొన్నారు.భారీగా పెట్టుబడులు పెట్టి ఆశాజనకంగా వ్యవసాయం చేసిన రైతులకు అనుకోని రీతిలో హంద్రీ వాగు ప్రవాహం తీవ్ర కష్టాలను తెచ్చిపెట్టింది దాదాపుగా మద్దికేర మండలం బురుజుల గ్రామం నుండి తెర్నేకల్ వరకు దేవనకొండ మండలంలో వెలమకూరు, కుంకనూరు,పొట్లపాడు.తెర్నేకల్ రెవిన్యూ పరిధిలో తీవ్ర పంట నష్టం జరిగింది రైతులు వేసుకున్న కంది, పత్తి,ఉల్లి మిరప, వేరుశనగ, సజ్జ, జొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి ఈ నేపథ్యంలో దెబ్బతిన్న పంటను అంచనా వేసి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం పెరుగుతున్న పెట్టుబడులతో అతివృష్టి అనావృష్టితో నిత్యం పంట నష్టాన్ని చవిచూస్తున్న రైతన్న నీ ఆదుకోవాలని ఎకరాకు 50 వేల పరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు బజారి మండల కమిటీ సభ్యులు మహబూబ్ బాషా యూసుఫ్ బాషా, ప్రజాసంఘాల నాయకులు సుధాకర్,రవి.బడే సాబ్ నాగేష్ ఆంజనేయులు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190